ABN ఆంధ్రజ్యోతి

# మెట్రోలో ప్రయాణం సురక్షితం

- మహిళల భద్రతే లక్ష్యంగా ట్యూటెమ్ యాప్
- ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైలు ద్వారా ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సురక్షితమైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల భద్రత విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు సాకారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రైల్(హెచ్ఎంఆర్), హైదరాబాద్ పోలీస్ సహకారంతో బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, ఐఐటీ ఖరగ్ పూర్, ఐఐటీ ముంబై సంయుక్తంగా ఏడీబీ ఆర్థిక సహాయంతో ట్యూటెమ్ (టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టు ఎన్‌హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ -ట్యూటెమ్) అనే కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారు. యాప్ రూపంలో ఇది త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా




బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం జరిగిన యూజర్ వర్క్‌షాప్‌లో ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే పరిష్కారమని అన్నారు. మెట్రోలో ప్రయాణించే మహిళలు తమ చిట్టచివరి గమ్యస్థానం వరకు భద్రంగా చేరడానికి ట్యూటెమ్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని వెల్లడించారు. తమ ఇళ్ల నుంది గమ్యస్థానాల వరకు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు లేకుండా సాంకేతిక పరిజ్ఞానం పొందుపరిచామని ఆయన తెలిపారు. ఈ యాప్‌లో డ్రైవర్ యాప్, యూజర్ యాప్ అని రెండు భాగాలు ఉంటాయని, ప్రయాణికులను, ముఖ్యంగా మహిళా ప్రయాణికులకు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేలా జాగ్రత్తలు పొందుపరచబడ్డాయని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. దారిలో ఎక్కడైనా మహిళా ప్రయాణికులకు అభద్రతా భావం ఏర్పడితే వారు వెంటనే పోలీస్ కంట్రోల్ సెంటర్‌ని, వారి కుటుంబ సభ్యులు, బంధువులను అప్రమత్తం చేసే సౌకర్యం ఈయాప్‌లో ఉందని ఆయన తెలిపారు. బిట్స్ పిలానీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి .రామ్ గోపాల్‌రావు మాట్లాడుతూ అర్ధరాత్రి సమయాల్లో కూడా మహిళలు సురక్షితంగా తమ గమ్యాలకు చేరడానికి 'ట్యూటెమ్' యాప్‌లో పలు సౌకర్యాలు పొందుపరిచామని అన్నారు. కార్యక్రమంలో ఏడీబీ ప్రతినిధి కుమారి జోసెఫిన్ ఎక్వినో, బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, ఐఐటీ ముంబాయికి చెందిన ప్రొఫెసర్ అవిజిత్ మాజీ, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ ప్రశాంత్ సాహు పాల్గొన్నారు.